క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్

మోమిన్‌పేట: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికులు తమ బంగారు నగలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బస్టాండ్‌లో మాత్రమే సీసీ కెమెరాలు ఉన్నాయని బస్సులో ఉండవని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఫోన్ల చోరీ ఎక్కువగా అవుతున్నాయన్నారు. డిజిటల్ లావాదేవిలు, మొబైల్ ఫోన్లకు వచ్చే ఎస్ఎంఎస్, ఓటీపీలు అపరిచితులకు చెప్పొదన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బలరాం, శంకర్‌నాయక్, కానిస్టేబుల్ రవి, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



రాజశేఖర్‌కు వీల్‌చైర్ అందిస్తున్న మార్వాడీ యువమంచ్ సభ్యులు

తాండూరు టౌన్: పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి తాండూరు మార్వాడీ యువమంచ్ సభ్యులు వీల్‌చైర్‌ను గురువారం అందజేశారు. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన కాంట్రాక్టు ఉద్యోగి రాజశేఖర్ ఆరు నెలల క్రితం అనారోగ్యంతో పక్షవాతానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న యువమంచ్ సభ్యులు మహేశ్ పర్తాని, దినేష్ పర్తానీ ఆర్థిక సహాయంతో పాటు ఆయనకు వీల్‌చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్మోహన్ సార్డా, తాండూరు అధ్యక్షుడు అనిల్ సార్డా, కార్యదర్శి సచిన్ రాఠి, కోశాధికారి అరుణ్ సార్డా, మాజీ అధ్యక్షుడు సూర్యప్రకాశ్ సోమాని, దినేశ్ పర్తాని తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వినతి



మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని 36వ వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఆ వార్డు ప్రజలు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వార్డు పరిధిలో ఏడాది కాలంగా మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వీధుల్లో కుక్కల బెడద పెరిగిందని, బయటకు ఒంటరిగా పిల్లలను పంపాలంటే భయంగా ఉందని కమిషనర్ దృష్టికి తెచ్చారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

108 సేవలను వినియోగించుకోవాలి



వాహనాన్ని పరిశీలిస్తున్న మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్ గౌడ్

కుల్కచర్ల: 108 సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని 108 వాహనాన్ని ఆయన పరిశీలించారు. అందులో ఉన్న రికార్డులు, ఆక్సిజన్ పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు ఎప్పటికప్పుడు అందబాటులో ఉంటూ సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు వచ్చిన ఫోన్‌కాల్స్‌ను రిసీవ్ చేసుకొని సమయానికి చేరుకొని బాధితులను కాపాడడంలో తగిన చొరవ చూపించాలన్నారు. ఈ సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాల్గొన్నారు.



బషీరాబాద్: జీవన్గీ మహాదేవలింగేశ్వర ఆలయాన్ని చుట్టుముట్టిన వరద



తాండూరు రూరల్: బెల్కటూర్‌లో కూలిన ఇల్లు



పరిగి: వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి



దోమ: గొడుగోనిపల్లి వాగు ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గోవిందమ్మ

వర్ష బీభత్సం!

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- పంట పొలాలను ముంచేసిన వాన
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు
- పలు చోట్ల రాకపోకలకు అంతరాయం

రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద పోటెత్తుతుంది. వికారాబాద్ పంట పొలాలలో వర్షపు నీరు చేరింది. పలు వాగులు భారీగా ప్రవహించాయి. తాండూరులోని బెల్కటూర్ బ్రిడ్జి వద్ద డైవర్షన్ రోడ్డు కొట్టుకపోయింది. గ్రామంలోని జట్టురి తుల్జమ్మ ఇళ్లు కూలిపోయింది. బషీరాబాద్ జీవన్గీ దగ్గర మహాదేవలింగేశ్వర స్వామి ఆలయాన్ని వరద ముంచేసింది. ఆలయ పరిసరాల్లో పార్కు చేసిన ఓ ప్రైవేటు బస్సు సగానికిపైగా నీటమునిగింది. వరదలో కొట్టుక పోకుండా తాళ్లతో స్తంభాలకు కట్టేశారు. ధారూరులోని హరిదాస్‌పల్లి, అంతారం, మోమిన్‌కలాన్, రాజాపూర్, అవుసుపల్లి, ధారూరు, మైలారం, నాగారం, మోమిన్‌ఖుర్దు, అంపల్లి, దోర్నాల్ తదితర గ్రామాల్లో వాగులు పొంగాయి. సమీప పంట పొలాలు నీట మునిగాయి. బొంరాస్‌పేట మహంతీపూర్ వద్ద కాగ్నా వాగు నిండుగా ప్రవహించడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. పరిగిలో పంట పొలాల్లో నీరు చేరాయి. రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పలు గ్రామాల్లోని చెరువులు, కుంలు మత్తటి దుంకుతున్నాయి. పరిగి వాగు పొంగి పొర్లడంతో వికారాబాద్, పరిగి రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పరిగి వాగును పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.



అనంతగిరి: పంటపొలాల్లో నిలిచిన వర్షపు నీరు



పరిగి: రంగాపూర్‌లో నీట మునిగిన పంటను చూపుస్తున్న రైతు



బొంరాస్‌పేట: మహంతీపూర్ వద్ద నిండుగా పారడంతో రాకపోకలు బంద్



పూడూరు: కంకల్‌లో పత్తి చేనులో చేరిన వరద నీరు



ధారూరు: అంతారంలో నీట మునిగిన పత్తి



దౌల్తాబాద్: నందారం చెరువు కింద తెగిన రోడ్డు



కొడంగల్: నీటి ఉధృతితో కోతకుగురైన పెద్దనందిగామ-నీటూర్ రహదారి

అవగాహనతో వ్యాధి నిర్మూలన



రావులపల్లిలో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: అవగాహనతో వ్యాధి నిర్మూలన సాధ్యమని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ బుస్రాఫాతిమా పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 111మందిని పరీక్షించినట్లు చెప్పారు. అనుమానితులకు 48 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టీబీ పేషంట్లు, కుటుంబసభ్యులు, డయాలసిస్, పొగాకు వాడేవారికి, ఆల్కహాలు తీసుకునేవారు, బీపీ, షుగర్, హెచ్ఐవి, 60 ఏళ్లు దాటిన వృద్ధులతోపాటు వివిధ రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు 6 నెలలపాటు ఉచిత మందులు అందిస్తారని పేర్కొన్నారు. పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ. వెయ్యి ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఆకలి లేకపోవడం, రెండు వారాలుగా ఎడతెరిపి లేని దగ్గు ఉన్నట్లయితే, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, చమటలు పట్టడం, ఆయసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని ఆమె తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు మహేందర్, అశ్విని, లక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ రాహత్‌అలీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘అప్రమత్తంగా ఉండండి’

పూడూరు: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చన్గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షాలు ఎడతెరిపిలేకుండా కురుస్తుండటంతో ముఖ్యమైన పనుల కోసం తప్ప బయటికి వెళ్లొదని సూచించారు. వికారాబాద్ జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించారన్నారు. ముఖ్యంగా ఈసి వాగు పరిసర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కంకల్, కడుమూరు వాగులు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు.

అత్యవసరమైతే తప్పా భయటకు రావొద్దు

దుద్యాల్: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిషన్ సూచించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకున్నాయని, అలుగు పారుతున్నాయని, రహదారుల గుండా వరద ప్రమహిస్తూ ప్రమాదకరంగా మారడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. కాబట్టి అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పేర్కొన్నారు.



మోమిన్‌పేట: కాస్లబాదు కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు

పాత ఇళ్లల్లో ఉండొద్దు

మోమిన్‌పేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయని అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని లచ్చానాయక్ తండా, కాస్లబాదు, రాంనాథ్‌గుడుపల్లి తదితర గ్రామాల్లోని కల్వర్టులను పరిశీలించారు. ఇంకా రెండు రోజులు అతి భారీ నుంచి భారీ వర్షాలు కురవనుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. పాత ఇళ్లల్లో నివాసముండొదన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రవీందర్, సీఐ వెంకట్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మరు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరని, గడ్డుకాలం మొదలైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్ ఆంజనేయులు పేర్కొన్నారు. తమ హక్కులను సాధించుకోవడానికి ఆసిఫాబాద్ నుంచి హైదారాబాద్ వరకు పాదయాత్ర చేస్తున్న పోడు భూముల రైతులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మద్దతుగా పాల్గొంటే అరెస్టు చేయడం బాధాకరమన్నారు. గురువారం పరిగి పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోడు రైతులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మద్దతు తెలిపితే అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతకు ఇది నిరదర్శనమన్నారు. ప్రభుత్వానికి ప్రజలే సరైన బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలే దిక్కులేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు రవీకుమార్, రవీందర్, తాహెర్‌అలీ, బషీర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నూతన సంఘాలు ఏర్పాటు చేసుకోండి

దౌల్తాబాద్: గ్రామాల్లో నూతన సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం వెంకన్న తెలిపారు. సంఘాల్లో లేని 18 నుంచి 60 సంవత్సరాల వయసుఉన్న మహిళలందరూ నూతన మహిళా సంఘాలుగా ఏర్పడి సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ నెల 30 వరకు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, కిశోరబాలికలతో కూడా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లొద్దు

తహసీల్దార్ పురుషోత్తం



సిరిపురం వీరన్న వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ పురుషోత్తం

మర్పల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకోని జాలర్లు, చేపలు పట్టేవారు చెరువుల వద్దకు వెళ్లొద్దని తహసీల్దార్ పురుషోత్తం పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రావులపల్లి, కుడుగుంట చెరువులతో పాటు సిరిపూరం వీరన్నవాగును ఆయన పరిశీలించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉన్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లో నివసించొదన్నారు. వాగుల్లో వరద ఉధృతి ఉంటే తగ్గిన తరువాతనే వెళ్లాలన్నారు. ఆయన వెంట మర్పల్లి ఎస్ఐ, ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

శాటిలైట్ ద్వారా భూ కంప కేంద్రం గుర్తింపు

పరిగి: తెల్లవారు జాము పరిగి, పూడూరు మండలాల్లో గురువారం భూ కంపం వచ్చింది. పూడూరు మండలం చన్గోముల్ గ్రామ సమీపంలో శాటిలైట్ ద్వారా భూ కంప కేంద్రాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. పది కిలోమీటర్ల లోతులో వచ్చినట్లు వారు పేర్కొన్నారు. 3.1 తీవ్రతతో కంపించడంతో రంగాపూర్, సోమన్‌గుర్తి, దేవనోనిగూడ, బసిరెడ్డిపల్లి, పరిసర గ్రామాల్లో భూకంపం నమోదైందని సమాచారం.

ప్రతిఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలి

ఎంపీడీవో అనురాధ



జాతీయ జెండాలతో ఎంపీడీవో కార్యాలయం ముందు ఎంపీడీవో అనురాధ తదితరులు

నవాబుపేట: ప్రతిఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని ఎంపీడీవో అనురాధ పేర్కొన్నారు. నవాబుపేట మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించేలా, జాతీయ జెండా యొక్క ఔన్నత్యాన్ని గుర్తు చేసేలా మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక బస్ స్టేషన్ వరకు జాతీయ జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 79వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పుండ్లిక్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జగన్, చంద్రకాంత్, ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింలు, రామ్ రెడ్డి, శ్రీహరి, వేణుగోపాల్, రాములు, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్, అంజి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి ఆలయంలో పూజ చేస్తున్న శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ తండాలో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు పెద్దేముల్ తండాలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధారాసింగ్ నాయక్, మాజీ సర్పంచు తారాబాయి ఆధ్వర్యంలో విగ్రహ, నవగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముందుగా తండాలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఊరేగించారు.